బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ నాయకుల చేరిక



కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నేతలు మాల్యాద్రి నాయుడు, షేక్ ఆరీఫ్

మణికొండ: కాంగ్రెస్ పార్టీ తమను గుర్తించటం లేదని, ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చ లేక ప్రజల్లో తిరస్కరణకు గురవుతుందనే కారణంతో ఆ పార్టీని వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు పలువురు నాయకులు ప్రకటించారు. నగరంలోని బీఆర్ఎస్ భవన్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి మాల్యాద్రినాయుడు, సీనియర్ మైనార్టీ నాయకుడు షేక్ ఆరీఫ్, రాజేంద్రనగర్‌కు చెందిన భాస్కర్‌గౌడ్, నిజాముద్దీన్, నవాజ్, అమీర్, నార్సింగి మున్సిపాలిటీ ఖానాపూర్ మాజీ సర్పంచ్ వెంకటేశ్‌యాదవ్‌లు తమ వందలాది మంది అనుచరులతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారని పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని మాజీ మంత్రులు కేటీఆర్, సబితారెడ్డి, మహమూద్ అలీ, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి కార్తీక్‌రెడ్డిలు మార్గదర్శకం చేశారన్నారు. మణికొండ మున్సిపాలిటీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధన్‌రాజ్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, లతాగౌడ్, విజయలక్ష్మి, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





ఖానాపూర్ మాజీ ఉపసర్పంచ్ వెంకటేశ్...

సినీ నటులు అలీ, సాయికుమార్ వివరాల సేకరణ





అలీ, సాయికుమార్‌లతో వివరాలు సేకరిస్తున్న మున్సిపల్ మేనేజర్ శ్రీధర్

మణికొండ: మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలలోని 38 వార్డులలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల ఇంటింటి సర్వే కొనసాగుతోంది. వార్డుల వారీగా వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి మార్గదర్శకాల ప్రకారం ఎన్యూమరేటర్‌లు సమాచారాన్ని తీసుకుంటున్నారు. వాటిని రోజు వారీగా ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. సర్వేలో భాగంగా శనివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలో నివసిస్తున్న సినీనటులు అలీ, సాయికుమార్‌ల నివాసాలకు వెళ్లి సర్వేకు సంబంధించిన వివరాలను అధికారులు సేకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కాంగ్రెస్



అత్తాపూర్‌లో మూసీ బాధితులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

అత్తాపూర్: కాంగ్రెస్ పాలకులు బడుగు, బలహీన వర్గాల ప్రజల ఇళ్ల నిర్మాణాలను కూలిస్తూ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నారని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ జనార్దన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి అన్నారు. బీజేపీ తలపెట్టిన కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకు మూసీ పరీవాహక ప్రాంతంలోని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపై దృష్టిసారించి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ముందుకు రావాలని ముఖ్యమంత్రికి సూచించారు.

స్వీయ రక్షణకు కరాటే నేర్చుకోవాలి



పోటీలను ప్రారంభిస్తున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి

గచ్చిబౌలి: ఆడపిల్లలు తైక్వాండో, కరాటే శిక్షణ పొందేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె శివసేనారెడ్డి సూచించారు. 38వ తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ క్యోరుగి అండ్ 13వ పూమ్సే తైక్వాండో చాంపియన్‌షిప్-2024 పోటీలను ఆయన గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తైక్వాండో, కరాటే, కుంగ్‌ఫూ లాంటి క్రీడలు శారీరక ధారుఢ్యంతోపాటు పిల్లల్లో మానసిక స్థైర్యాన్ని, అలాగే స్వీయ రక్షణ సామర్థ్యాన్ని పెంచుతాయన్నారు. కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలలో రాణించేందుకు విద్యార్థులు కృషి చేయాలని ఆయన సూచించారు.

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి

గోల్కొండ: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శనివారం గోల్కొండ పోలీస్‌స్టేషన్‌లో ఆయన పీస్ అండ్ మైత్రి కమిటీ సభ్యులు, దర్గాలు, ఆలయాల నిర్వాహకులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు, ప్రజల మధ్య సత్సంబంధాల కోసం నగర కమిషనర్ పీస్ లవర్స్ అనే యాప్‌ను ప్రారంభించారన్నారు. శాంతిభద్రతలు కాపాడడం, స్థానికుల మధ్య సత్సంబంధాలను ప్రతిష్టం చేయడం ఈ యాప్ లక్ష్యమన్నారు. గోల్కొండ లాంటి ప్రశాంతమైన ప్రదేశంలో పని చేయడం తమ అదృష్టమని నగరంలో జరిగే అతిపెద్ద పండుగలు,



జాతీయ పండుగలు గోల్కొండలోనే జరుగుతాయన్నారు. మసీదులు, దర్గాలు, ఆలయాల వద్ద నిర్వాహకులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఏసీపీ అశోకచక్రవర్తి, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, పీస్ కమిటీ ప్రతినిధులు ఆబీద్, ఇలియాస్ అలీ, ఎస్.రాజువప్రసాద్, ఏ.పరమానందం తదితరులున్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై కొరడా

- పోలీస్‌ల స్పెషల్ డ్రైవ్
- పాదచారులకు తప్పని ఇబ్బందులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోకపోతే ఎలా
- స్వచ్ఛందంగా తొలగించాలని సూచన
- లేకుంటే చట్టప్రకారం చర్యలు తథ్యం
- అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్



అత్తాపూర్‌లో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్

అత్తాపూర్: ఫుట్‌పాత్‌లపై వెలసిన అక్రమ దుకాణాలను వెంటనే తొలగించాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకట్రామిరెడ్డి, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.రాజేందర్‌గౌడ్‌లు హెచ్చరించారు. శనివారం లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులతో కలిసి హైదర్‌గూడ సర్దార్ వల్లభాయ్ పటేల్ చౌరస్తా నుంచి నందిముస్లాయిగూడ చౌరస్తా వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రోడ్డుకు ఇరువైపులా పాదచారుల అవసరాల నిమిత్తం ఖాళీ స్థలాలను ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఫుట్‌పాత్‌లు కాని స్థలాలు తమ వ్యాపారాల కోసమే ప్రభుత్వం ఏర్పాటు చేసిందని యద్ధేశ్చగా ఎవరికి వారు చట్టాలను ఉల్లంఘిస్తూ దుకాణ సముదాయాలను ఏర్పాటు చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు.

◆ ఫుట్‌పాత్‌లపై తాత్కాలికంగా ఏర్పాటు చేసుకుంటూ ఆ తర్వాత పక్కా దుకాణాలుగా ఈ స్థలాలు ఈ దుకాణాలు మావే అంటూ కోర్టులను ఆశ్రయిస్తూ సమయాన్ని వృథా చేయడం అలవాటుగా మారిందని దుకాణ యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు వాహనాదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక స్థలాల్లో తమ దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

◆ ప్రయాణికుల సౌకర్యార్థం కోసం బస్టాండ్‌లో ఆటో వాలాలు తిష్ట వేయడం సరి కాదని దీంతో స్థానికులకు ఇబ్బందికరంగా మారుతూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలాగే ట్రాఫిక్ అధికారులు సూచించిన రోడ్డు మార్గాల్లోనే వాహనాదారులు ప్రయాణించాలన్నారు.

◆ రాంగ్‌రూట్‌లో వ్యతిరేక దిశల్లో ప్రయాణిస్తూ ప్రమాదాలు కొని తెచ్చి పెడుతున్నారని కిలోమీటర్ దూరమైన సురక్షిత ప్రయాణం చేయాలని ప్రయాణికులకు ప్రమాదాలు జరగకుండా ఎవరికి వారు ప్రతినబూనాలని సూచించారు.

నేడు కార్తీక వన భోజనాలు

మణికొండ: పవిత్ర కార్తీక మాసం నేపథ్యంలో ఆదివారం పుప్పాలగూడ అనంత పద్మనాభస్వామి ఆలయ ఆవరణలో వన భోజనాలను ఏర్పాటు చేయనున్నట్లు వీఆర్ 4 సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు లక్ష్మణ్‌రావు తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వన భోజనాలతో పాటు గోపూజ, ఉసిరి పూజ, భజనలు, కీర్తనలు, సాంస్కృతిక క్విజ్, శ్లోక పఠనం లాంటివి నిర్వహిస్తామన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కేంద్ర మంత్రి సురేష్‌గోపికి స్వాగతం



శంషాబాద్: కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ సహాయ మంత్రి, సినీనటుడు సురేష్‌గోపికి బీజేపీ నేతలు ఎయిర్‌పోర్టులో ఘనంగా స్వాగతం పలికారు. నగరంలో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రికి కిసాన్‌మోర్చా శంషాబాద్ అధ్యక్షుడు మాదిరెడ్డి మహిపాల్‌రెడ్డి, నాయకులు మాదిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, రాపోలు వినోద్‌లు శాలువాలు వేసి సన్మానించారు.

హెచ్‌సీయూలో క్లీనప్‌డ్రైవ్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్‌ను పరిశుభ్ర క్యాంపస్‌గా మార్చడమే లక్ష్యమని హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం క్లీనప్ డ్రైవ్ నిర్వహించారు. క్యాంపస్‌లోని స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, హార్టికల్చర్, శానిటేషన్ విభాగాల ఆధ్వర్యంలో చెట్ల కొమ్మలు, వ్యర్థాలు, చెత్తాచెదారంతోపాటు ఇతర వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భీమ్ సింగ్, వాలంటీర్లు, శానిటేషన్ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట

గోల్కొండ: పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేస్తూ చెత్తాచెదారాలను తొలగింపు పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని ఆర్ఈ సస్టేనిబులిటీ హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ ఎంఎస్‌డబ్ల్యూ లిమిటెడ్ ప్రాజెక్ట్ హెడ్ మనోజ్ అగర్వాల్ అన్నారు. సంస్థ 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం సెవన్ టూంబ్స్‌లోని డెక్కన్ పార్కులో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను చేపట్టారు. ఈ సందర్భంగా పార్కులో పేరుకుపోయిన చెత్తాచెదారాలు, వ్యర్థాలను తొలగించి పార్కును శుభ్రం చేశారు. ఈ సందర్భంగా మనోజ్ అగర్వాల్ మాట్లాడుతూ.. సంస్థ ఆధ్వర్యంలో ప్రతిరోజూ చెత్తాచెదారాల తొలగింపు పనులను సక్రమంగా నిర్వహిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. టిప్పర్లల్లోని డ్రైవర్స్, హెల్పర్స్ కు సేఫ్టీ పరికరాలను ప్రతి వారం అందిస్తున్నామన్నారు. మాస్క్, గ్లౌజ్, షూ తదితర వాటిని ధరించి హెల్పర్స్ పనులను చేస్తున్నారన్నారు.

చెట్ల కొమ్మలను తొలగించరా?

రాజేంద్రనగర్: బుద్వేల్ రహదారిపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన మొక్కలను చెట్లను, చెట్ల కొమ్మలను విద్యుత్‌శాఖ సిబ్బంది నాలుగు రోజుల క్రితం నరికివేశారు. నరికి వేసిన అనంతరం ఆ కొమ్మలను తొలగించకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు ప్రమాదభరితంగా మారాయి. నాలుగు రోజుల క్రితం నరికి వేయడంతో ప్రస్తుతం ఎండిపోయాయి. ప్రమాదవశాత్తు ఎవరైనా వీటికి నిప్పంటిస్తే ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు విద్యుత్ వైర్లు కాలిపోనున్నాయి. ఈ విషయాన్ని స్థానికులు విద్యుత్ అధికారులకు ఫోన్ చేసి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రోడ్డుపైనే ఉన్న చెట్ల కొమ్మలు

బెంబేలెత్తిస్తున్న వీధి కుక్కలు

కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు

మైలార్‌దేవ్‌పల్లి: చిన్నారులు ఒంటరిగా రోడ్లపై విడిచి పెట్టాలంటే తల్లిదండ్రులు జంకుతున్నారు. ఎటు నుంచి కుక్కలు దాడి చేస్తాయో అనే భయం పట్టుకుంది. చిన్నారులను చేయి పట్టుకొని రోడ్డుపై నడువాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పద్మశాలీపురంలో శుక్రవారం రఫీ, ఆయోషాలు దంపతులు వీరికి సంతానం గులాబ్బా(5) పాఠశాల నుంచి ఇంటికి వచ్చి ఆరు బయట కూర్చొని ఆడుకుంటుండగా వీధి కుక్కలు ఓ చిన్నారిపై ముకుమ్మడిగా దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యింది. కాలి కండరాలు బయటికి కనబడేలా కరిచాయి. స్థానికులు కుక్కలను తరమడంతో చిన్నారి ప్రాణాలతో బయట పడింది. వెంటనే స్థానిక దవాఖానాకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. కుక్కల స్వైరవిహారం నుంచి చిన్నారులను కాపాడాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాలలో కుక్కల దాడికి చిన్నారులు బలయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అధికారులు కుక్కలు ఉన్న ప్రదేశాలను గుర్తించి వాటిని తీసుకెళ్లాలని కోరుతున్నారు. మధుబన్ కాలనీ, టీఎన్జీవోస్ కాలనీ, పద్మశాలీపురం ప్రాంతాలలో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. అధికారులు గుర్తించాలని స్థానికులు వేడుకుంటున్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

అత్తాపూర్: వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హసన్‌నగర్ ప్రాంతానికి చెందిన షేక్ నూర్(40) జూలై 22వ తేదీన ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లాడు. అతడి కోసం ఫోన్‌లు చేసిన స్విచ్ ఆఫ్ వస్తుంది. అతడి ఆచూకీ కోసం చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేసిన ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో భార్య షబానా బేగం అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

◆ అత్తాపూర్ హసనగర్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ సిరాజుద్దీన్ కురేషి(42) ఈ నెల 12వ తేదీన ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయాడు.



షేక్ నూర్



మహ్మద్ సిరాజుద్దీన్

అతడి కోసం భార్య పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె పోలీసులు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

మూసీ సుందరీకరణ పేరుతో ఇళ్లు కూల్చితే సహించం

బండ్లగూడ: మూసీ సుందరీకరణ పేరుతో ఇళ్లను కూలిస్తే భారతీయ జనతా పార్టీ సహించదని, ప్రజల పక్షాన పోరాడుందని చేవెళ్ల కొండ విశ్వేశ్వరరెడ్డి అన్నారు. తెలంగాణ బీజేపీ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హైదర్షాకోట్‌లోని మూసీ రివర్ బెడ్ బాధితులతో కలిసి మూసీ నిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండ విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన తరువాత ఇల్లు కూలుస్తాననటం సరికాదని, ఒకవేళ తప్పని పరిస్థితిలో కూలిచ్చేయాల్సి వస్తే మార్కెట్ విలువను మూడింతలు కింద నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సంగప్ప, భీమార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మూసీ నిద్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కొండ విశ్వేశ్వరరెడ్డి తదితరులు

19న 'టీ హబ్'లో 'టీ' అవార్డుల ప్రదానం

తెలంగాణ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

రాయదుర్గం: తెలంగాణ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ షో- 24 కార్యక్రమాన్ని ఈనెల 19న 'టీ హబ్'లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు 'టీ' ప్రతినిధులు ప్రకటించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్ ప్రాంగణంలో తెలంగాణ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం సమావేశమయ్యారు. ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షారోన్ అమీర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మొదటి నమోదిత కళాకారుల సంఘంగా 'టీ' గుర్తింపు పొందిందన్నారు. రాష్ట్రంలో స్థానిక కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. విభిన్న రంగాలకు చెందిన తెలంగాణ కళాకారులకు ఈనెల 19న అవార్డుల ప్రదానం ఉంటుందన్నారు. తెలంగాణ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డిజే పీయూష్, ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్‌ఖాన్, జాయింట్ సెక్రెటరీ ఈషా హిండోచా, ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యులు నౌషబా ఫారూఖీ, జిబ్రాన్‌ఖాన్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారనంగా కాటేదాన్ సబ్ స్టేషన్‌లో పరిధిలోని ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. కాటేదాన్ పారిశ్రామిక వాడ, సాయిబాబానగర్, గంగోత్రి విద్యుత్ ఫీడర్ పారిశ్రామిక వాడ, గమేష్ నగర్, అమ్మగార్డెన్, పయనీర్ స్కూల్, బాబాటెంట్ హౌస్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నేతాజీ నగర్, శ్రీరామ్ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ ఆపి వేస్తామన్నారు. గగన్ పహాడ్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రవిఫుడ్, రామ్ చరణ్ ఆయిల్ మిల్ ప్రాంతాలలో విద్యుత్ నిలిపివేస్తామని వివరించారు.

తడి, పొడి చెత్తను వంద శాతం సేకరించాలి



చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తమ ఇంట్లోని చెత్తను ప్రతి రోజూ ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ ఆటో రిక్షా కార్మికులకు అందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌లోని కేకేనగర్, 2వ డివిజన్‌లోని హైదర్షాకోట్‌లో తడి, పొడి చెత్త సేకరణ పనులను పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఆటోలకు ఇవ్వాలని ప్రజలకు సూచించారు. వంద శాతం ఇంటింటి చెత్త సేకరణ జరగాలని కార్మికులకు తెలిపారు. శానిటరీ జవాన్లు రామాంజులు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ రవీందర్‌రెడ్డి

శంషాబాద్: శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్.రవీందర్‌రెడ్డి విద్య, సామాజిక సేవా విభాగంలో అందించిన ఉత్తమ సేవలకుగాను జాతీయ అవార్డు లభించింది. గ్లోబల్ పీస్, కల్చర్ అసోసియేషన్, పుడమి సాహిత్య వేదిక, ఫిలాంత్రఫికల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని బిర్లా ప్లానిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలన దాతల సహకారంతో ఆయన చేసిన అభివృద్ధితో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అందిస్తున్న సహకారానికి గుర్తింపు దక్కినట్లు తెలిపారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ, హుడా కాలనీలో ఆదివారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ మణికొండ నాయకులు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య శిబిరం అందుబాటులో ఉంటుందన్నారు. అందులో గుండె, దంత, జనరల్, బీపీ, ఈసీజీ, సుగర్, ఎముకలకు సంబంధించిన కార్పొరేటర్ ఆస్పత్రుల డాక్టర్‌లు ఉచితంగా పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేస్తారన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

18న ఉచిత వైద్య శిబిరం

రాజేంద్రనగర్: జాతీయ ప్రకృతి వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 18వ తేదీన రాజేంద్రనగర్ బుద్వేల్‌లోని రాఫా ప్రకృతి ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. నిపుణులైన డాక్టర్ల బృందం వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు చికిత్సలు యోగా తదితర వాటిపై అవగాహన కల్పిస్తారన్నారు. వివరాలకు ఫోన్: 90637 61343లో సంప్రదించాలని కోరారు.

కారు ఢీకొని ప్రభుత్వ ఉద్యోగి మృతి

శంషాబాద్: కారు ఢీకొని ప్రభుత్వ ఉద్యోగి మృతిచెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... మండలంలోని పోశెట్టిగూడ గ్రామానికి చెందిన కావలి దశరథ(40) జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి పట్టణంలోని ఫ్లైఓవర్ మీదుగా బైక్‌పై ఇంటికి వెళుతుండగా కారు ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలపాలైన అతడిని వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

చార్మినార్: అఖిల భారత జవహర్ లాల్ నెహ్రూ అండర్-16 చెస్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన జరీర్ అహ్మద్ ఖాన్ విజేతగా నిలిచారు. 8 రౌండ్లలో 7, 5 పాయింట్స్ సాధించి ఆల్ ఇండియా జవహర్‌లాల్ నెహ్రూ చెస్ టోర్నమెంట్ చాంపియన్‌గా నిలిచాడు. టోర్నమెంట్‌లో 7 పాయింట్స్ సాధించిన శ్వేతార్క్ శ్రేయాస్ మలానీ ద్వితీయ స్థానంలో నిలిచారు. పాతబస్తీ మొగల్‌పురాలోని ఉర్దూఘర్‌లో ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పోటాపోటీగా జరిగిన చెస్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన విజేతలకు శనివారం బహుమతుల ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ రియాజ్ పాషా, కార్యదర్శి సయ్యద్ అబ్దుల్ హై ఖాద్రీ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. చెస్ క్రీడల్లో విద్యార్థులు రాణించే విధంగా తమ సొసైటీ కృషి చేస్తుందన్నారు.